

తోకలేనిపిట్టల గూడు చెదిరింది

కమ్మని కలల కబుర్లు, ఆనంద విషాదాల సమాచారాలు మోసుకొచ్చే తోకలేని పిట్టల ఎర్రని గూడు ఇప్పుడిలా మిగిలింది. ఒకప్పుడది.. ఎదురుచూపుల ఖిల్లా.. కలల కార్ఖానా.. ఆశనిరాశలు రెక్కలు విప్పుకుని ఎగిరిపోయే ముందు వాలేది ఈ ఎర్రపెట్టెలోనే. ఎంత ఇష్టం.. ఎంత భద్రం.. ఈ గూడు! కబురు మోసుకొచ్చే జాబుగువ్వలుండేది ఈ గూటిలోనే కదా అని దారినపోయే వారంతా ఈ ఎర్రపెట్టెను అపురూపంగా చూసుకుంటూ కదిలిపోయేవారు.

కాలం కఠినమైంది కదా! మంచైనా చెడైనా అంగీకరించాల్సిందే, అనుసరించాల్సిందే. అరచేతిలో ఇమిడిపోయిన ఆరంగుళాల బుల్లి ఫోను ముందు ఈ ఎర్రపెట్టె వెలవెలపోయింది. రోజులకు రోజులు సమాచారం ఎగిరి రావాల్సిన అవసరం అంతరించిపోయింది. క్షణాల్లో సమాచారం బట్వాడా అయిపోతున్న కాలంలో ఈ జాబుల గూడు ఒక గతకాలపు జ్ఞాపకంగా మారిపోయింది. ఇదిగో ఇలా.. కుప్పంలో జాతిపిత విగ్రహం ఎదుట కూరగాయల దుకాణదారుల మధ్య కనీకనిపించకుండా దాగిపోయి వచ్చీపోయేవారిని దీనంగా చూస్తోంది.

- కుప్పం



‘సదరం’లో అక్రమాలెన్నో..!

- వైసీపీ నేతలు చెప్పిన వారికే సర్టిఫికెట్లు
- అవసరమైతే ఎమ్మెల్యే సిఫారసు లేఖలు
- అర్థం లేని కారణాలతో అర్హులకు మొండిచేయి
- గత ఐదేళ్లు ఖజానాకు గండి



జిల్లాలోని మొత్తం 2,71,693 పింఛన్లలో 35,874 దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. ఇందులో 30 శాతానికిపైగా అనర్హులు ఉన్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. చిత్తూరు నగరం, రూరల్, జీడీనెల్లూరు, పూతలపట్టు, చంద్రగిరి నియోజకవర్గాల్లో అధికం శాతం అనర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు వైసీపీ నేతలు దళారులుగా వ్యవహరించి వారికి అనుకూలమైన వారికి నిబంధనలకు విరుద్ధంగా సదరం సర్టిఫికెట్లను వైద్యులతో ఇప్పించి, లక్షల రూపాయలు దండుకున్నారు. సదరం ధ్రువపత్రాల జారీలో వైద్యులపై పెత్తనం చెలాయించి, తమ పనికానిచ్చారు. అవసరమైతే మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. తద్వారా ప్రభుత్వ ఖజానాకు గడిచిన ఐదేళ్లు భారీగా గండికొట్టారు.

- చిత్తూరు రూరల్

అన్నీ బాగున్నా బెడ్‌రెస్ట్ పింఛను

యాదమరి మండలం కాశిరాళ్ల సచివాలయ పరిధికి చెందిన టి.మురళి బాగా నడవగలడు. మాట్లాడగలడు. అయితే ఇతను రూ.15 వేలు డీఎంహెచ్‌వో పింఛను పొందుతున్నాడు. వైసీపీ సానుభూతిపరుడు కావడంతో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల సిఫారసుతో సదరం సర్టిఫికెట్టు పొందాడు. అన్నీ బాగున్నా బెడ్‌రెస్ట్ అని చెప్పి నెలనెలా పింఛను పొందుతున్నాడు. కాశిరాళ్ల పంచాయతీలోనే ఏడుగురు బోగస్ పింఛన్లు పొందుతున్నారని స్థానికులు చెబుతున్నారు.



పింఛను తీసుకుంటున్న మురళి

వైకల్యం లేకున్నా పింఛను..

- చిత్తూరు నగరం 20వ డివిజన్ కాజూరు వైసీపీ ఇన్‌చార్జ్ మహేష్‌బాబు బాగా నడవగలడు. 45 శాతం వైకల్యం ఉన్నట్లు తప్పుడు ధ్రువపత్రం పొందారు. తద్వారా గత ఐదేళ్లుగా దివ్యాంగుల పింఛను పొందుతున్నాడు. అంతేగాక ఆ కోటాలో రూ.1.25 లక్షల విలువచేసే మూడు చక్రాల యాక్టివా వాహనం కూడా పొందాడు. ఆయనకు వైకల్యం లేదని స్థానికులు చెబుతున్నా సదరం సర్టిఫికెట్ ఉందని, అందుకే పింఛను ఇస్తున్నామని సచివాలయ ఉద్యోగులు సమాధానం చెబుతున్నారు.



→ మహేష్‌బాబు

అన్ని అర్హతలు ఉన్నా తొలగించారు..

ఐరాల మండలం మిరియంగంగనపల్లెకు చెందిన తులసీరామ్ పుట్టుకతోనే పూర్తి స్థాయి అంగవైకల్యం కలిగి ఉన్నాడు. కొంత కాలానికి తండ్రి మృతి చెందాడు. తల్లే చూసుకుంటోంది. ప్రతి నెలా వైద్య ఖర్చులకు రూ.15 వేల వరకు ఖర్చు అవుతుంది. టీడీపీ హయాంలో ఈ యువకుడికి పూర్తి అంగ వైకల్యం కింద పింఛను ఇచ్చేవారు. మందుల ఖర్చులకు ఉపయోగపడేది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అతని తల్లిదండ్రులకు పొలం ఉందనే కారణం చూపుతూ పింఛను తొలగించింది.

ఆ వైద్యుల్లో వణుకు

కూటమి అధికారంలోకి రావడం...దివ్యాంగుల పింఛను రూ.3 వేల నుంచి 6 వేలకు, మంచానికే పరిమితమైన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచడంతో సదరం సర్టిఫికెట్లపై అందరి దృష్టిపడింది. లబ్ధిదారుల్లో బోగస్ ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం సర్టిఫికెట్ల జారీ అంశంపై లోతైన విచారణ చేస్తుందన్న వాదన వినిపిస్తోంది. దీంతో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు, కాసులకు కక్కుర్తి పడి అనర్హులకు సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యుల్లో వణుకు మొదలైంది.

అనర్హులకు పింఛనుపై ఎమ్మెల్యే విస్మయం..

ఎస్ఆర్ పురం మండలంలో ఓ వైసీపీ సర్పంచ్ భర్త బతికుండగానే ఒంటరి మహిళ అని చెప్పుకుని పింఛను పొందుతోంది. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఈనెల 3వ తేదీన జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ విషయాన్ని లేవనెత్తారు. ఈనెల ఒకటో తేదీన అనర్హులకు స్వయంగా తన చేతుల మీదుగా పింఛను అందించాల్సి వచ్చిందని అన్నారు. ఇలా అనేకమంది అనర్హులు పింఛన్ పొందుతున్నారని ఆయన అధికారులకు వివరించారు. అదే సమయంలో అర్హులకు పింఛన్లు తొలగించారని, విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నకిలీ సదరం సర్టిఫికెట్లు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

చెరువు ఆక్రమిత భూమిలో మామిడి తోట



సాగుచేసిన పంటలు



పంటలు వేయడానికి దుక్కి సిద్ధం చేసిన దృశ్యం



చెరువును చెరబట్టారు

- 12 ఎకరాలు ఆక్రమించిన వైసీపీ నేతలు
- బీడుగా మారిన ఆయకట్టు
- ప్రశ్నించిన గ్రామస్తులపై దాడులు

గుడుపల్లె, జూలై 20: గుడుపల్లె మండలం గుండ్లసాగరంలోని చెన్నెని చెరువు ఆక్రమణకు గురవుతోంది. గుండ్లసాగరం గ్రామానికి కొంత దూరంలో సర్వే నెం.157లో 14.74 ఎకరాల్లో చెన్నెని చెరువు ఉంది. ఈ చెరువు భూమిపై వైసీపీ నేతల కన్నుపడింది. కుప్పంలోని పెద్ద నాయకుల అండతో కొందరు కార్యకర్తలు చెరువు భూమిని ఆక్రమించారు. 14.74 ఎకరాల్లో 12 ఎకరాలు ఆక్రమించి, పంటలు సాగు చేస్తున్నారు. పశువులను మేత, నీటి కోసం చెరువు వద్దకు తీసుకుపోతే దాడులు చేస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందని వాపోతున్నారు. చెరువు ఆక్రమణతో ఆయకట్టు కింద భూములు బీడుగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కుప్పంలో కలెక్టరు సుమిత్ కుమార్, కడా పీడీ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్సులో ఒక రైతు దీనిపై ఫిర్యాదు సైతం చేశారు. అధికారులు స్పందించి చెరువును కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జవహర్ నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు

చిత్తూరు (సెంట్రల్), జూలై 20: జవహర్ నవోదయ విద్యాలయాలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె మండలం వలసపల్లిలోని నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు సెప్టెంబరు 16లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2013 మే 1, 2015 జూలై 31 మధ్య కాలంలో జన్మించి ఉండాలని తెలిపారు. 2024-25 ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 5వ తరగతి చదువుతూ, తల్లిదండ్రులు స్థానికులై ఉండాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

తహసీల్దార్ల బదిలీలు.. రెండ్రోజుల్లో కొలిక్కి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 20: తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోన్-4 పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాలకు జిల్లా నుంచి బదిలీ అయిన 31 మంది తిరిగి వచ్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది. దీంతో సోమవారం నాటికి తహసీల్దార్ల బదిలీల అంశం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. సీసీఎల్ఏ నుంచి ప్రొసీడింగ్స్ వచ్చిన తర్వాత సొంత జిల్లాలకు వచ్చేస్తారు. ఎన్నికల సమయంలో జరిగిన వ్యయ వివరాలన్నీ బిల్లులతో సహా అందజేసిన వారికే రిలీవింగ్ ఆర్డర్లు ఇస్తారు. సొంత రెవెన్యూ డివిజన్ల పరిధిలో నియమించకూడదన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో పనిచేసిన చోటు కాకుండా 31 మందిని వేరే స్థానాలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు తహసీల్దార్లకు మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారిక ఉత్తర్వులు ఇస్తారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు

ఐరాల(కాణిపాకం), జూలై 20: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది. శనివారం ఆలయానికి జిల్లా నుంచేగాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులతో క్యూలన్నీ పూర్తిగా నిండి పోయాయి. రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాగునీరు సరఫరా చేశారు.



ద్రావిడ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



గుడుపల్లె, జూలై 20: ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కంప్యూటర్ సైన్స్ శాఖలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య కిరణ్ కుమార్ శనివారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య దొరస్వామి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కిరణ్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు నియామకపత్రం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో రిజిస్ట్రార్‌గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రిజిస్ట్రార్‌కు అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

సీతమ్మ చెరువు కట్ట నిర్మించి మెటీరియల్ తీసుకెళ్లండి

పీఎల్ఆర్ కంపెనీ సిబ్బందిని అడ్డుకున్న రైతులు

పుంగనూరు, జూలై 20: సీతమ్మ చెరువు కట్టను నిర్మించిన తర్వాతే మెటీరియల్ తీసుకెళ్లాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ కంపెనీ సిబ్బందిని రైతులు అడ్డుకున్నారు. శనివారం సోమల మండలం ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు ప్రాంతం నుంచి మెటీరియల్ తీసుకెళ్లేందుకు పీఎల్ఆర్ కంపెనీ సిబ్బంది లారీలు, యంత్రాలను తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సమీప గ్రామాల బాధిత రైతులు ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. గతంలో కోర్టు ఆదేశించినా లెక్క చేయకుండా చెట్లు కూల్చి, సీతమ్మ చెరువు కట్టను అన్యాయంగా తొలగించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపై అక్రమంగా తప్పుడు కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. తమపై అన్యాయంగా కేసులు పెట్టినవారు ఇప్పుడు ఎక్కడున్నారని నిలదీశారు. గతంలో సీతమ్మ చెరువు కట్ట ఏ విధంగా ఉందో అదే తరహాలో నిర్మించిన తర్వాత మెటీరియల్ తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.



పీఎల్ఆర్ సిబ్బందిని నిలదీస్తున్న బాధిత రైతులు

పదేళ్ల బాలికపై అత్యాచారం

- నిందితుడిపై పోక్సో కేసు

కల్లూరు, జూలై 20: పదేళ్ల బాలికపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన పులిచెర్ల మండలంలో చోటుచేసుకుంది. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... పులిచెర్ల మండలానికి చెందిన దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం తన భర్త కూలి పనికి వెళ్లగా పదేళ్ల కుమార్తెను ఇంటి వద్ద వదిలి ఆమె కట్టెల కోసం తోటలోకి వెళ్లింది. బాలిక సమీపంలో ఉన్న సచివాలయం వద్ద ఆడుకుంటోంది. ఇది గమనించిన అదే పంచాయతీ ముప్పిరెడ్డిగారిపల్లికి చెందిన రెడ్డిహుస్సేన్(28) బాలికకు మాయమాటలు చెప్పి సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. గంట తర్వాత బాలిక తల్లి ఇంటికి రాగా కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా జాడ కనిపించకపోవడంతో మామిడి తోటలోకి వెళ్లగా బాలిక ఏడుస్తూ తల్లి దగ్గరకు పరుగున వచ్చి జరిగిన విషయం తెలిపింది. ఇంటికి వచ్చి భర్తకు విషయం చెప్పింది. గ్రామస్తుల సూచన మేరకు కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెడ్డి హుస్సేన్ పరారీలో ఉన్నాడని, అతనిపై పోక్సో చట్టం, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, కల్లూరు సీఐ శ్రీనివాసులు బాలిక తల్లిదండ్రులను విచారించారు.

తిరుపతి జేసీగా బన్సల్

- కమిషనర్‌గా మౌర్య





శుభం బన్సల్ - మౌర్య

తిరుపతి(కలెక్టరేట్)/తిరుపతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్ మరోసారి నియమితులయ్యారు. ప్రస్తుతం మన్యం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న శుభం బన్సల్ గత యేడాది డిసెంబరు 23 నుంచి మార్చి 16 వరకు తిరుపతి జేసీగా పనిచేశారు.మూడు నెలల్లోనే శాప్ ఎండీగా బదిలీపై వెళ్లారు.తిరిగి శ్రీవారి పాదాల చెంత జేసీగా పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.కాగా ప్రస్తుత జేసీ హెచ్ఎం ధ్యానచంద్ర విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.ఎన్నికల సమయంలో తిరుపతికి వచ్చిన తాను సీనియర్ అధికారులనుంచి ఎంతో నేర్చుకున్నానని ధ్యానచంద్ర చెప్పారు.తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నారపురెడ్డి మౌర్య నియమితులయ్యారు.కర్నూలు జాయింట్ కలెక్టర్‌గా ఉన్న ఆమె తిరుపతి కమిషనర్‌గా బదిలీపై రానున్నారు.2020 బ్యాచ్‌కు చెందిన మౌర్యకు గత ఏడాది ఏప్రిల్లోనే తిరుపతి కమిషనర్‌గా అవకాశం వచ్చింది. ప్రసూతి సెలవులో ఉన్న ఆమెను తిరుపతి కమిషనర్‌గా అప్పటి వైసీపీ ప్రభుత్వం నియమించింది. అయితే చివరి నిమిషంలో ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ హరితను కమిషనర్‌గా నియమించింది. కొత్త ప్రభుత్వంలో ఏడాది తర్వాత మళ్లీ తిరుపతి కమిషనర్‌గా ఆమెకు అవకాశం దక్కడం గమనార్హం.కాగా ప్రస్తుత కమిషనర్ అదితిసింగ్ కడప జాయింట్ కలెక్టర్‌గా బదిలీఅయ్యారు.దాదాపు 6 నెలలు పాటు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆమె వచ్చీరాగానే దొంగ ఓట్ల ఏరివేతపై పెద్ద కసరత్తు చేశారు. ఎన్నికల నిర్వహణలోనూ క్రియాశీలకంగా పనిచేశారు.

భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోంది

హోంమంత్రి అనిత


తిరుమల ఆలయం వెలుపల భక్తులతో మాట్లాడుతున్న అనిత

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి):శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోందని హోంమంత్రి అనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం అనిత ఆలయం ముందు భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు చాలా ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నారన్నారు. గతానికంటే ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని, లడ్డూ, అన్నప్రసాదాల్లో నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నట్టు తెలిపారు. ఇదే ఆనందం భక్తుల్లో నిత్యం ఉండాలని కోరుకుంటున్నానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎన్డీయే కూటమిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. స్వామి ఆశీస్సులుంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుందనే నమ్మకం ఉందన్నారు.

సర్పాల సయ్యాట



గూడూరు తహసీల్దారు కార్యాలయ సమీపంలో శనివారం సాయంత్రం రెండు పాములు సయ్యాట లాడుతూ కన్పించాయి.మీసేవ కార్యాలయ ఆవరణలో గంటకు పైగా రెండు పాములు ఒకదానితో ఒకటి పెనవేసుకుని పెనుగులాడుతుండడాన్ని వెలుగు, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది గమనించారు. అయితే కార్యాలయాల ఆవరణలో ఇలా విషసర్పాల సంచారంపై వారంతా భయాందోళనకు లోనవుతున్నారు.

- గూడూరు

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌పై కేసు

రేణిగుంట, జూలై 20: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ శోభారాణిపై కేసు నమోదయ్యింది.రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల ద్వారా వచ్చిన రూ.21.51 లక్షల సొమ్మును ప్రభుత్వ ట్రెజరీకి చెల్లించకపోవడం గుర్తించిన జిల్లా రిజిస్ట్రార్ కమలాకర్ గతంలో సబ్ రిజిస్ట్రార్ శోభారాణితో పాటు సీనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అంతేకాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 16న ఫిర్యాదు చేశారు.దీంతో సబ్ రిజిస్ట్రార్ శోభారాణి, సీనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌పై కేసు నమోదయ్యింది.

ఏడు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 20: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో గడచిన 24 గంటల్లో ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గుడిపాలలో 5.8, కుప్పం 3.4, పలమనేరు 2.6, గుడుపల్లి 2.6, వి.కోట 2.2, గంగవరం, శాంతిపురం మండలాల్లో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రెండు టెంపోల ఢీ - ఇద్దరికి తీవ్రగాయాలు


ఢీకొన్న టెంపోలు - గాయపడ్డ భాస్కర్, సూర్యకాంతం

శాంతిపురం, జూలై 20: కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని కడపల్లె సమీపంలో శివపురం వద్ద శనివారం రెండు టెంపోలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రగాయపడ్డారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం సమీపంలోని రంగాపురం గ్రామానికి చెందిన సూర్యకాంతం పాల టెంపోలో తిరుపతి వైపు తీసుకెళ్తున్నారు. కృష్ణగిరి చెందిన భాస్కర్, మణి మరో టెంపోలో కర్ణాటక రాష్ట్రం చింతామణికి వెళుతున్నారు. కడపల్లె సమీపంలోని శివపురం వద్ద టెంపోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. భాస్కర్, సూర్య కాంతంలకు తీవ్ర గాయాలయ్యాయి. మణికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజి ఆసుపత్రికి తరలించారు. రాళ్లబూదుగురు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉష ఉన్నత విద్యకు సహకరించాలని సీఎంకు వినతి

పుంగనూరు, జూలై 20: తన కుమార్తె ఉష ఉన్నత విద్య అభ్యసించడానికి సహకరించి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబుకు తండ్రి ఉమాశంకర్ కోరారు. పుంగనూరు చెందిన ఉమాశంకర్ శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన తన కుమార్తె ఎం.ఉష తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో ఎమ్మెస్సీ 80 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలైనా ఎన్ఎస్‌పీ స్కాలర్ షిప్ మంజూరుకు నిరాకరించారని, గోల్డ్ మెడల్ ప్రకటించలేదని, పీహెచ్‌డీకి అవకాశం కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ఆదేశించినా యూనివర్శిటీ అధికారులు స్పందించలేదని సీఎం ఎదుట వాపోయారు. ఉష ఉన్నత విద్య అభ్యసించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని, సంబంధిత అధికారులను విచారించి న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని తెలియజేశారు.



ఆకట్టుకున్న పాండవ జననం

వెదురుకుప్పం, జూలై 20: మండలంలోని పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన పాండవ జననం ఘట్టం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాండవుల ప్రతిమలు భక్తులను ఆకర్షిం చాయి. పచ్చికాపల్లంకు చెందిన పొన్నాల మోహన్‌రెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు.

పోలీసుల అదుపులో వృద్ధురాలి హత్య కేసు నిందితుడు!

లోతుగా విచారిస్తున్న దర్యాప్తు బృందం


స్కూటర్‌పై పరారవుతున్న శ్రీనివాసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 20: తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం రాత్రి జరిగిన వృద్ధురాలు జయలక్ష్మి హత్య కేసులో నిందితుడిగా గుర్తించిన శ్రీనివాసులును పోలీసులు తిరుమలలో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉన్మాదిగా తయారైన ఆ యువకుడు రెండు కుటుంబాల మధ్య నెలకొన్న మనస్పర్థలు, వృద్ధురాలు తరచూ మందలిస్తుండడంతో పగ పెంచుకున్నాడు. రెండేళ్ల కిందట కూడా జయలక్ష్మి ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించినట్లు సమాచారం. ఆ తర్వాత ఇంటి ముందున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ రెండు ఘటనలతో రాయల్‌నగర్ నుంచి పెద కాపు లేఅవుట్‌కు కాపురం మార్చాలని స్నేహితులు, కొందరు కుటుంబీకులు జయలక్ష్మి కుటుంబానికి సూచించినా వారు పట్టించుకోలేదు. ఈ విషయాలు తెలియడంతో దర్యాప్తు బృందం మరింత లోతుగా విచారిస్తోంది.

విచారణలో ఆసక్తికరమైన విషయాలు

పోలీసుల విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడైనట్లు సమాచారం. నిందితుడు శ్రీనివాసులు.. జయలక్ష్మి మనవరాలిని ఈవ్‌టీజింగ్ చేసేవాడు. దీనిపై మనవరాలు తండ్రికి చెప్పింది. 'ఏమీ కాదులే నువ్వు ధైర్యంగా వెళ్లు.. నేను చూసుకుంటా' అని ఆమె తండ్రి పలుసార్లు ధైర్యం చెప్పి భరోసా కల్పించాడని తెలిసింది. ఇది తెలిసి జయలక్ష్మి పలుసార్లు శ్రీనివాసులును మందలించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. దీంతో పగ పెంచుకున్న శ్రీనివాసులు హత్యకు మూడు, నాలుగు రోజుల నుంచి వృద్ధురాలి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. ఒంటరిగా దొరికితే చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం జయలక్ష్మిని ఒంటరిగా వదిలి ఆమె కోడలు, పెద్ద మనవరాలు డ్రైవింగ్ నేర్చుకోవడానికి బయటకు వెళ్లారు. చిన్న మనవరాలు 15 నిమిషాల్లో స్కూల్ నుంచి వస్తోందని తెలిసి గేట్లు అన్నీ కూడా తెరచి పెట్టారు. దీన్ని అదనుగా భావించిన నిందితుడు తనింట్లో వారికి గుంటూరుకు వెళుతున్నానని చెప్పి బ్యాగు సర్దుకుని బయటకు వచ్చాడు. మెయిన్ గేటు ద్వారా ఇంట్లోకి ప్రవేశించి ఫస్ట్ ఫ్లోర్‌లో ఎవ్వరూ లేకపోవడంతో అక్కడ బట్టలు మార్చుకున్నాడు. డూప్లెక్స్ హౌస్ కావడంతో రెండో ఫ్లోర్‌లోకి వెళ్లి అక్కడున్న జయలక్ష్మిని కత్తితో వెనుక నుంచి బలంగా పొడిచాడు. ఆమె గట్టిగా కేకలు వేసింది. కింది ఫ్లోర్‌లోని బెడ్‌రూములో ఉన్న చిన్న మనవరాలు నియతి కూడా అరవడంతో ఆమెవద్దకొచ్చి గట్టిగా నెట్టాడు. ఆమె కిందపడి స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత ఇంట్లో ఉన్న వేయింగ్ మిషన్‌తో మళ్లీ రెండో ఫ్లోర్‌కి వెళ్లి వృద్ధురాలి ముక్కుపై బలంగా బాది హత్య చేశాడు. మరోవైపు స్పృహలోకి వచ్చిన నియతి రెండో అంతస్తులోకి వెళ్లగా ఆమె మెడపై నాలుగు కత్తి పోట్లు పొడిచాడు. నియతి గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో ఇంట్లోకి వస్తున్న కోడలు రక్ష, పెద్ద మనవరాలు ప్రేరణ ఈ కేకలను విన్నారు. మరోవైపు నిందితుడు పరారవుతున్న క్రమంలో కిందకు దిగగా.. ఎదురుగా మెట్లపై కనిపించిన ప్రేరణను పక్కకున్న గోడకు బలంగా బాది, ఆమె వద్ద నుంచి ద్విచక్ర వాహనం తాళాలు లాక్కొని పరారైనట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.

అన్నప్రసాదం, లడ్డూ నాణ్యతలో లోపాలు గుర్తించాం

మార్పులు చేశామన్న టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, జూలై20(ఆంధ్రజ్యోతి):శ్రీవారి భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం, లడ్డూల నాణ్యతలో లోపాలు గుర్తించామని, వాటి నాణ్యత పెంపుకోసం ఇప్పటికే చాలా మార్పులు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.క్యూలైన్లో భక్తులకు ఆహారపదార్థాలు, పిల్లలకు పాలు అందడం లేదని, సాంబారన్నం నాణ్యత బాగలేదని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరని ఫిర్యాదులందిన క్రమంలో క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయం ఆహారపదార్థాలు అందించేందుకు ప్రత్యేకంగా మూడు షిఫ్టుల్లో ఏఈవో స్థాయి అధికారులను నియమించామన్నారు.మరుగుదొడ్లను రెట్టింపు చేయడంతో పాటు కొన్ని చోట్ల శాశ్వత క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పదార్థాలతో స్వామికి నైవేద్యం సమర్పిస్తున్నారని,అయితే అవి ఆర్గానిక్ కాదనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.కాబట్టి సేంద్రియ పదార్థాలా కాదా అనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో రైస్, సాంబారు, మజ్జిగ వంటి పదార్థాల్లో నాణ్యత కనిపించలేదన్నారు.నూకల బియ్యం వస్తున్నాయని తెలిసి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.లడ్డూకి రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ముఖ్యమని, ముడిసరుకుల్లో ఉన్న లోపాలను కూడా గుర్తించామన్నారు.ఇకపై బెస్ట్ క్వాలిటీ నెయ్యి తెప్పించి, గతంలో స్వామి లడ్డూకి ఉండిన వైభవాన్ని మళ్లీ తీసుకొస్తామన్నారు.ఇకపై నాణ్యత కలిగిన ముడిసరుకులు ఇవ్వకపోతే జరిమానా విధిస్తామన్నారు.తిరుమలలో కొన్ని రెస్టారెంట్లు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. కనీసం పరిశుభ్రత పాటించకపోవడంతో పాటు నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను భక్తులకు విక్రయిస్తున్నారన్నారు. ఇకపై తక్కువ ధరలతో పాటు నాణ్యత ఉండాలని హోటళ్ల నిర్వాహకులను ఆదేశించామన్నారు. రెస్టారెంట్లు తీసుకునేవారితో పాటు టూరిజం హోటళ్లను కూడా సబ్ లీజ్‌కు ఇవ్వకూడదనే నిబంధన పెడతామన్నారు. ప్రముఖ హోటళ్ల నిర్వాహకులకే ఇకపై రెస్టారెంట్లు కేటాయించే నిబంధన పెడతామన్నారు.గతంలో టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతోందని, ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. గతంలో అన్నప్రసాదాలు బాగాలేవని చెప్పిన భక్తులపై పెట్టిన కేసుల ఉపసంహరణపై పరిశీలిస్తామన్నారు. టీటీడీ ఉద్యోగులు చాలా కష్టపడి పని చేస్తున్నారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

బషీర్‌కు ఎమ్మెల్యే అమర్ అభినందన



గంగవరం,జూలై 20: పర్యావరణాన్ని పరిరక్షించాలనే ధ్యేయంతో పలమనేరు నుంచి లడక్‌కు దిగ్విజయంగా సైకిల్ యాత్ర పూర్తిచేసి స్వగ్రామానికి చేరుకున్న బషీర్‌ను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభినందించి సన్మానించారు.లడక్‌యాత్ర పూర్తిచేసిన బషీర్ శుక్రవారం రాత్రి పలమనేరుకు చేరుకున్నారు. అతడికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పట్టణ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని బషీర్ గతనెల జూన్ 12వ తేదీన సైకిల్ యాత్ర ప్రారంభించి లడక్‌కు చేరుకొని, పలమనేరు ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేశారని కొనియాడారు.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో సైకిల్‌పై వేల కిలోమీటర్లు సాగడం గర్వకారణమన్నారు.సమాజంలోని ప్రతిఒక్కరూ బషీర్‌ను ఆదర్శంగా తీసుకొని పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు.

పూల దండలు, శాలువాలు వద్దు

ఆ డబ్బుతో నోటుపుస్తకాలు ఇవ్వండి!

పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ విజ్ఞప్తి


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

తవణంపల్లె, జూలై 20: 'నన్ను అభినందించడానికి, ఆహ్వానించడానికి పూలదండలు, శాలువాలతో రావద్దు' అని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ విజ్ఞప్తి చేశా రు. ఆ డబ్బులతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, అవసరమైన సామగ్రిని అందజేయాలని ఆయన కోరారు. శనివారం తవణంపల్లి మండలంలోని 66 పాఠశాలల్లో ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెల్లగుండ్లపల్లె సర్పంచ్ మాధవిమోహన్‌నాయుడు దంపతులు సుమారు రూ.3.5 లక్షలు విలువ గల నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అరగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలదండలు, శాలువాల కోసం రూ.5 వేలు నుంచి రూ.10 వేలు ఖర్చు అవుతోందని, ఇకపై ఈ డబ్బులతో విద్యా సామగ్రిని కొనుగోలు చేసి, బుక్ బ్యాంక్‌లో వేయాలని సూచించారు. అరగొండ బాలుర, బాలికల పాఠశాలల్లో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు ముందుకు వచ్చిన కొండ్రాజుకాల్వ సర్పంచ్ పరంధామనాయుడును ఎమ్మెల్యే అభినందించారు. డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, తహసీల్దార్ అరుణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్ల రాజ్యంగా రాయలసీమ

ఓ సామాజిక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడం సీమ చరిత్రకు దర్పణం

బీఎస్పీ జోనల్ సమావేశంలో రిటైర్డు డీజీపీ పూర్ణచంద్రరావు


బీఎస్పీ సమావేశంలో ప్రసంగిస్తున్న పూర్ణచంద్రరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20: రాయలసీమ రెడ్ల రాజ్యంగా మారిందనీ.. ఒక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడమే ఇక్కడి చరిత్రకు దర్పణమని రిటైర్డు డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన బీఎస్పీ జోనల్ స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. బలిజలతో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు రాయలసీమలో 70 శాతం ఉన్నారని, అయితే కేవలం 8 శాతం మాత్రమే వున్న రెడ్డి సామాజిక వర్గం దశాబ్దాలుగా ఇతర కులాలను, మరీ ముఖ్యంగా ఎస్సీ, బీసీ వర్గాలను ఎదగనీయకుండా అడ్డుపడుతోందన్నారు. ఒక వైపు భయపెడుతూ మరో వైపు దోచుకుంటూ అన్ని ప్రధాన పార్టీల్లోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు రాజ్యమేలుతున్నారని వాపోయారు.గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మెజారిటీ స్థానాలు రెడ్లకే కేటాయించాయని ఆవేదన వ్యక్తం చేశారు.రిజర్వు సీట్ల వల్ల ఎస్సీలకు ఆ మాత్రం సీట్లున్నాయనీ, లేకపోతే వాటిని కూడా మాయం చేసి ఉంటారన్నారు.వైఎస్, పెద్దిరెడ్డి, జేసీ, భైరెడ్డి, నల్లారి, భూమన, శిల్ప, మేకపాటి తదితరుల వలలో చిక్కి రాయలసీమ సర్వనాశనం అయ్యిందన్నారు.కులగణన జరగకుండా సామాజిక న్యాయం జరగదని స్పష్టం చేశారు.బీఎస్పీ రాయలసీమ కో-ఆర్డినేటర్, రిటైర్డు జడ్జి గుర్రప్ప, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, ఉపాధ్యక్షులు గౌతం, నాయకులు మల్లిక, విజయకుమార్, జానకిప్రసాద్, సురేంద్ర, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి ఐఐటీ వార్షికోత్సవం

ఏర్పేడు, జూలై 20: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరవ వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా కో ఫౌండర్ ఆఫ్ ఇన్ఫోసిస్ ఛైర్మన్ క్రిస్ గోపాలకృష్ణ, అతిథులుగా జెస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ హాజరుకానున్నట్లు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. అతిథుల చేతుల మీదుగా ఐఐటీలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు : 8 దుంగల స్వాధీనం



స్మగ్లర్, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూలై 20: అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీప్రాంతంలో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ని అరెస్టు చేశారు. ఆర్ఐ(ఆపరేషన్స్) సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం శుక్రవారం అటవీ శాఖ సిబ్బందితో కలిసి సానిపాయ బేస్ క్యాంపు నుంచి రాయవరం మీదుగా ఆవుల దారి, సరస్వతి కటువ, ముదుంపాడు అటవీప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. అటవీప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకెళ్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా దుంగలను వదలి పారిపోయారు. వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా అత్తిపట్టు, వీరప్పనూరు పంచాయతీకి చెందిన రమేష్(32)గా గుర్తించారు. అనంతరం సంఘటనా స్థలం నుంచి ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాహు కేతు పూజల పేరుతో మోసం

- భక్తులను దగా చేస్తున్న దొంగస్వామి
- ప్రైవేటు లాడ్జీలే కేంద్రంగా సాగుతున్న తతంగం

శ్రీకాళహస్తి, జూలై 20: పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఓ బురిడీ స్వామి భక్తులను నిలువునా దగా చేస్తున్నాడు. గత మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో దోష పరిహార పూజలు చేస్తానని నమ్మిస్తూ భారీగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నాడు. బాధితులు గగ్గోలు పెడుతూనే ఉన్నా ఇప్పటి వరకు అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. అడిగేవారే లేకపోవడంతో రాహుకేతు పూజల పేరుతో దొంగస్వామి తన మోసాలను కొనసాగిస్తూనే ఉన్నాడు. తాజాగా శుక్రవారం అనంతపురానికి చెందిన ఓ భక్తుడికి ఫోన్ చేసి దోషం పేరుతో భారీగా నగదు వసూలు చేసేందుకు విఫలయత్నం చేశాడు. అనంతపురానికి చెందిన నాగేంద్ర ఏప్రిల్ 4న శ్రీకాళహస్తికి విచ్చేశాడు. ముక్కంటి ఆలయంలో అర్చన విభాగంలో అటెండర్‌గా పనిచేసే ఓ ఉద్యోగికి సన్నిధివీధిలో ఉన్న లాడ్జీలో గదిని అద్దెకు తీసుకుని రాత్రి అక్కడే బస చేశాడు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు జరిపించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం గోవిందశర్మ అనే పేరుతో ఓ వ్యక్తి నాగేంద్రకు ఫోన్ చేశాడు. ఫలాన తేదీన ముక్కంటి ఆలయంలో రాహుకేతు పూజలు జరిపించుకున్నారు కదా అని పరిచయం చేసుకున్నాడు. మీరు ఏ సమస్యపై రాహుకేతు పూజలు జరిపించు కున్నారంటూ విషయం రాబట్టాడు. వెంటనే ఫోన్‌పే ద్వారా 9063695327 నెంబరకు రూ.5,116 నగదు వేస్తే దోష పరిహారం కోసం పూజలు చేస్తానంటూ నమ్మించాడు. అప్పటికప్పుడే పూజ ప్రారంభం అవుతుందంటూ ఆలస్యం కాకుండా నగదు జమ చేయాలని నాగేంద్రను తొందరపెట్టాడు. అయితే తాను స్వయంగా శ్రీకాళహస్తికి వచ్చి నగదు చెల్లిస్తానని నాగేంద్ర చెప్పాడు. తాను ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రుల స్థాయివారితోనే మాట్లాడుతానని, నేరుగా కలిసేందుకు సమయం లేదంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. నాగేంద్ర శ్రీకాళహస్తిలోని తనకు పరిచయస్థులకు గోవిందశర్మ మాట్లాడిన వాయిస్ రికార్డును పంపాడు. నాగేంద్ర మిత్రుడు ఆరా తీయడంతో గోవిందశర్మ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేశాడు. ఈవిషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ఆగని బరితెగింపు

శ్రీకాళహస్తిలోని లాడ్జీల్లో బసచేసే వారి వివరాలను ఓ ఆగంతకుడు మూడు సంవత్సరాలుగా సేకరిస్తున్నాడు. భక్తులు బసచేసిన మూడు నెలల తరువాత వారికి ఫోన్లుచేస్తూ తేదీ, ఊరు, పేరు, సమయంతో సహా భక్తులతో మాట్లాడు తున్నాడు. వివరాలు పూర్తిగా చెబుతూ శ్రీకాళహస్తీశ్వరాలాయనికి చెందిన స్వామిగా వందలాది మందిని నమ్మించి మోసం చేస్తున్నాడు. చాలా మంది భక్తులు పలుమార్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గతంలో గోవిందశర్మ మోసాలపై ఫిర్యాదు చేశారు. కానీ చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఆగంతకుడు మరింతగా బరితెగిస్తున్నాడు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పుంగనూరులో యువతకు ఉపాధి కల్పించాలి



మంత్రి నారా లోకేశ్‌తో మార్పురి రమేశ్

పుంగనూరు రూరల్, జూలై20: పుంగనూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేష్ తెలిపారు. శనివారం విజయవాడలో మంత్రిని ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, వృత్తివిద్యా కోర్సులు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని కోరినట్లు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మల్లప్ప కొండలో ఘనంగా పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరుడు

గుడుపల్లె, జూలై 20: మండల పరిధిలోని స్వర్ణగిరి మల్లప్ప కొండలో కొలువైన మల్లేశ్వరుడి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహిం చారు. ఉదయం ఆలయ అర్చకులు ఉమాపతి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలం కరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తరువాత ఆలయ ఆవ రణలో హోమాలు నిర్వహించారు. సాయంత్రం కొండపై దీపోత్సవం చేపట్టారు. వందలాది మంది భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్

కుప్పం, జూలై 20: రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై చర్యలు తప్పవని కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ హెచ్చరించారు. ఐఆర్ఎం కళాశాలలో శనివారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగివుండాలని చెప్పారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయరాదని, మద్యంతాగి బండి నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎం కళాశాల ఛైర్మన్ బీఎం.దయానిధి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇంటింటి సర్వే



రామకుప్పం, జూలై 20: రామకుప్పం మండలంలో గ్రామాల్లో ఇంటింటి సర్వే చురుగ్గా సాగుతోంది. గ్రామాల్లో సచివాలయ అధికారులు, సిబ్బంది ఇంటింటా తిరిగి ప్రతి కుటుంబంలో మౌలిక వసతులపై వివరాలు సేకరిస్తున్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గంలో పర్యటించిన సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం యూనిట్‌గా తీసుకుని మౌలిక వసతులు కల్పన, ఆ కుటుంబం ఆర్థికంగా ఎదిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగానే సర్వే సాగుతోంది. శనివారం కెంచనబల్లలో జరిగిన సర్వేలో పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, టీడీపీ బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, యూనిట్ ఇన్‌చార్జీ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు గుణశేఖర్‌లు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



రామకుప్పం, జూలై 20: కుప్పం నియోజకవర్గంలో జనసేన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేష్, రామకుప్పం మండల అధ్యక్షుడు హరీష్ తెలిపారు. శనివారం వారు రామకుప్పం మండలం కొంగనపల్లెలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, మహేష్, శ్రీకాంత్, భాస్కర్, గంగాధర్, సురేష్, చరణ్, సుబ్బు, నందకుమార్, ఆంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చంద్రబాబు కృషి



శాంతిపురం జూలై 20: విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని సర్పంచ్ బాలక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం నడింపల్లె పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనేక వసతులు ఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునివెంకటప్ప, గోవిందరాజులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుండుగల్లు హైస్కూల్‌కు మినరల్ వాటర్ వితరణ



గంగవరం, జూలై 20: మండలంలోని గుండు గల్లు హైస్కూ ల్‌కు అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయ కులు జయ సింహ మినరల్ వాటర్ వితరణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. గుండుగల్లు హైస్కూల్లో సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. విషయం తెలుసుకున్న జయసింహ సొంత నిధులతో రోజూ 15 క్యాన్‌ల నీటిని ఉచితంగా అందిస్తానని వివరించారు. మినరల్ వాటర్‌ను అందించిన దాత జయసింహను హెచ్ఎం రవి సన్మానించి అభినందించారు.

అరుణాచలానికి అదనపు ఆర్టీసీ సర్వీసులు

పుంగనూరు రూరల్, జూలై 20: తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలానికి అదనపు ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. అయితే ఈ నెల గురుపౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల కోరిక మేరకు అదనపు సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్కదేవతలకు విశేష పూజలు

సోమల, జూలై 20: మండలంలోని చిన్నసోమల సమీప అక్కదేవతల ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అక్కదేవతల పూజా సామగ్రిని సోమల నుంచి ఉభయదారులు చిన్నిగారి కుటుంబసభ్యులు బాణ సంచా వేడుకలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయం వద్దకు తీసుకెళ్లారు. భక్తులు ఉపవాస దీక్షలతో అక్కదేవతలకు పిండి దీపాలు వెలిగించారు. ఈ పూజల్లో హెడ్ కానిస్టేబుల్ సి.సత్యనారాయణ, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సూర్య ప్రకాశ్, జనార్థన్, ప్రేమ్, గంగాధరం, దామోదరం, బాల సుబ్రహ్మణ్యం, సోమల, చిన్నసోమల, ముండ్రివారిపల్లె గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

సోమల, జూలై 20: కుష్టు వ్యాధి నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని సోమల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మేటిమంద పాఠశాలలో కుష్టు వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లత, అమరనాథ్, భాస్కర్ నాయుడు తదిరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

సోమల, జూలై 20: మూగజీవాలకు వర్షాకాలంలో సోకే వ్యాధుల పట్ల రైతులు, వైద్యసిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సోమల పశుసంవర్థక శాఖ ఏడీ శ్రీనివాసులు నాయుడు సూచించారు. శనివారం సోమల వైద్యశాలలో పశువులకు సోకిన వ్యాధులకు పలు చికిత్సలు కల్పించారు. అనంతరం శిక్షణ పొందుతున్న వైద్య సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో షెడ్లు, పరిసరాలు శుభ్రంగా చేసుకోవాలన్నారు. జీవాలు కలుషితమైన నీరు తాగకుండా చూసుకోవాలన్నారు. పశువైద్యాధికారి చందన ప్రియ, శివ, అరుణ, ఓబులేసు, తేజ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నవచండీ పారాయణం



చౌడేపల్లి, జూలై 20: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయ కొండలో పౌర్ణమి సందర్భంగా శాస్త్రోక్తంగా వేదపండితులు నవచండీ పారాయణాన్ని శనివారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు చండీపారాయణంలో పాల్గొన్నారు.

ఆలయ మాన్యాలకు రక్షణ కల్పించండి

చౌడేపల్లి, జూలై 20: చౌడేపల్లి మండలంలోని ఆలయ భూములకు రక్షణ కల్పించాలని బీజేపీ నాయకులు కడియాల మనోహర్ దేవదాయ రాష్ట్ర కమిషనర్ సత్య నారాయణకు వినతిపత్రం అందజేశారు. శనివారం తిరుపతిలోని దేవదాయ శాఖ కార్యాలయంలో ఆయనను కలసి చౌడేపల్లి మండలంలోని వేణుగోపాల స్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, చిన్నకొండామర్రిలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాలకు చెందిన వందలాది ఎకరాల మాన్యం భూములు దురాక్రమణకు గురైయ్యాయని వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంధోడి ప్రవీణ్, పి. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు సభను విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, జూలై20: తిరుపతిలో ఈ నెల 22న జరిగే మాలమహానాడు సభను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 27 పథకాలను అమలు చేయాలని, అలాగే కార్పొరేషన్లుకు నిధులు విడుదల చేయాలని, గత ప్రభుత్వ పాలనలో దళితులపై పెట్టిన తప్పుడు కేసులను రద్దు చేయాలని కోరారు. ఈ అంశాలపై రాయలసీమ ప్రాం తంలోని మాలమహానాడు నాయకులు చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, రమేశ్, రెడ్డెప్ప, భాస్కర్, మంజు పాల్గొన్నారు.

సీఐటీయూ పుంగనూరు అధ్యక్ష, కార్యదర్శుల రాజీనామా

పుంగనూరు రూరల్, జూలై 20: సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు గీత, ధనలక్ష్మిలు శనివారం రాజీనామాలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని చింతపండు కార్మికుల సమస్యలపై అనేకమార్లు జిల్లా కమిటీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తమ పదవులకు రాజీనామా చేసినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



గుడుపల్లె, జూలై 20: మండల పరిధిలోని పొగురుపల్లె -కుప్పం ప్రధాన రహదారిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యామగానిపల్లెకు చెందిన వైసీపీ కార్యకర్త మురళి కొన్ని నెలలుగా మట్టి నుంచి ఇసుకను ఫిల్టర్ చేసి ట్రాక్టర్ ద్వారా సరిహద్దులు దాటిస్తూ సొమ్ము చేసుకొంటున్నాడని పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసుల పొగురుపల్లె మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బిల్లులు లేకుండా మురళి ఇసుక రవాణా చేస్తుండడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి

కడ ప్రాజెక్టు అధికారి వికాస్‌మర్మత్



టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడతున్న వికాస్‌మర్మత్

రామకుప్పం, జూలై 20: సీఎం చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీనేతలు సమష్టిగా కృషి చేయాలని కడ ప్రాజెక్టు అధికారి వికాస్ మర్మత్ కోరారు. శనివారం రామకుప్పం మండలం సచివాలయంలో ఆయన అధికారులు, టీడీపీ, బీజేపీ నేతలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ఉద్యానపంటలు సాగు చేస్తున్నారని, ఉద్యాన ఉత్పత్తుల ద్వారా స్థానికంగానే సాస్‌లు, ఊరగాయలు తయారీని ప్రోత్సాహించాల్సిన అవసరముందన్నారు. రామకుప్పం, శాంతిపురం మండలాల మధ్య ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు కానుండటంతో వ్యవసాయోత్పత్తులతో బాటూ సాస్‌లు, ఊరగాయలు ఎగుమతులు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఇక్కడి రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల మొగ్గు చూపుతుండటం సంతోషకరమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో నాణ్యమైన, అధిక దిగుబడులు రావడమే కాకుండా, మార్కెట్లో వాటికి అధిక ధరలు సైతం దొరుకుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చేపట్టాల్సి పనులపై సత్వరం నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి వీధిలో సీసీరోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సమావేశాల్లో తహసీల్దారు శ్రీధర్, ఈఓపీఆర్‌డీ రాధాకృష్ణ, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, నాయకులు సీతాపతి, రామ్మూర్తి, గంట్లప్పగౌడు, రామకృష్ణప్ప, నందారెడ్డి, వెంకటరమణ, బాలరాజు, సుబ్రీ, మంజునాథ్, అవినాశ్, ఆదిల్, సురేష్ పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

కుప్పం, జూలై 20: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం భువనేశ్వరి పర్యటన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా భువనేశ్వరి ఈనెల 23, 24, 25, 26 తేదీలలో పర్యటిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా కుప్పం మండలంలో 24వ తేదీన పర్యటన ఉంటుందన్నారు. మండలంలోని ఎన్.కొత్తపల్లె, నడిమూరు, పైపాళ్యం, ఉర్లవోబనపల్లె, గుడ్ల నాయనిపల్లె పంచాయతీలలో ఆమె పర్యటించి, మహిళలతో ముఖాముఖి పాల్గొంటారని చెప్పారు. అంతేకాక రచ్చబండ కార్యక్రమంలో కూడా పాల్గొంటారన్నారు. ఆయా కార్యక్రమాలకు మహిళలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు వసంతమ్మ, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ఏపీ.రవి, మహేంద్ర, రామచంద్ర, నాయకులు సంతోశ్, రవి, క్రిష్ణయ్య, పార్థసారధి, రమేశ్, సుబ్రమణ్యం, అశోక్, సుబ్బు, స్వాతి రాజగోపాల్, సంజీవి, రాధాకృష్ణ, బి.వెంకటేశ్, వళ్లియప్ప, సంతూర్, దివాకర్, గోపి, శివకుమార్, బాలాజీ తదదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

కుప్పం, జూలై 20: చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల పరిధిలో నాణ్యమైన విద్యుత్తును, నిరంత రాయంగా సరఫరా చేయడమే తమ లక్ష్యమని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆపరేషన్స్ సురేంద్ర నాయుడు అన్నారు. కుప్పం రెస్కో పరిధిలో విద్యుత్ సరఫరాను మరింతగా మెరుగు పరచడానికి అనువైన చర్యలు తీసుకుంటామన్నారు. కుప్పం రెస్కో పరిధిలోని సబ్‌స్టేషన్లను ఎస్ఈ సురేంద్రనాయుడు శనివారం పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై విద్యుత్ సరఫరా, ఇబ్బందులు, నివారణ చర్యలపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రెస్కో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవ సాయం, పరిశ్రమలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సబ్‌స్టేషన్ల మధ్య ఇంటర్ లింకింగ్ లైన్లు ఏర్పాటు చేయడం ద్వారా సమస్యను పరిష్కరిస్తామన్నారు. లూజ్‌లైన్లు, వంగిపోయిన, దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలను గుర్తించి వెంటనే రీ ప్లేస్ చేస్తామన్నారు. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు ప్రమాద పరిస్థితులను గుర్తించి ఫ్యూజులు వంటివాటిని మార్చుకోవాలని సూచించారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రీవెన్స్ రిజిస్టర్లు పెట్టాలని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్తు సమస్యలు ఉంటే 1912కు కాల్‌చేసి పరిష్కారాలు పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కుప్పం రెస్కో ఎండీ సోమశేఖర్, డీఈ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణతో డయేరియాకు చెక్



వైద్య సిబ్బందితో సమావేశమైన కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూలై 20: కుప్పం పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం మున్సిపల్ మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతోను, పారిశుధ్య సిబ్బంది తోనూ వేర్వేరుగా సమావేశమయ్యారు. డయేరియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు విధిగా నీటి నిల్వలు లేకుండా తమ ఇళ్ల ఆవరణలను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల లార్వాలు పెరగకుండా డ్రై డే పాటించాలన్నారు. పారిశుధ్య సిబ్బంది మురుగు నీటి కాల్వల్లో పూడిక పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని ఆదేశించారు. దోమల నిర్మూలన మందులను పిచికారీ చేయాలన్నారు. తాగునీటి పైపులైన్లు, మురుగు నీటి పైపులైన్లు కలిసిపోకుండా చూడాలని సూచించారు. అంతకుముందు కమిషనర్ ఉదయం 5 గంటలకు మస్టర్‌కు హాజరై పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. పట్టణంలో పర్యటించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం మేనేజరు ఇమ్రాన్ ఖాన్, మెడికల్ ఆఫీసర్ హేమంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన సజావుగా సాగాలని గిరి ప్రదక్షిణ



రామకుప్పం, జూలై 20: సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ కూటమి ప్రభుత్వ పాలన సజావుగా సాగాలని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆంజి నేయరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు శనివారం తమిళనాడు రాష్ట్రం తిరు వణ్ణామలైలో గిరి ప్రదర్శన చేశారు. పాలనలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా చూడాలని, సీఎం చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి మనోహర్ నేతలు మోహన్, వేణు, తులసీ, కృష్ణప్ప, అప్పోజి, శివ, మంజు, నారాయణప్ప, మురుగన్, వెంకటేశు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. మహిళ మృతి



రత్నమ్మ (ఫైల్‌ఫొటో)

కల్లూరు, జూలై 20: పులిచెర్ల మండలం కల్లూరు- సదుం రోడ్డు చల్లావారిపల్లి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో మహిళ ఓ మృతి చెందింది. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి కథనం మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం తిప్పి రెడ్డిగారిపల్లికి చెందిన రత్నమ్మ (65), శుక్రవారం అదే మండలంలోని మల్లేవాండ్లపల్లికి చెందిన తన అల్లుడు విశ్వనాథ్(50)తో కలిసి సదుం మండలంలో జరిగిన అంత్య క్రియల్లో పాల్గొన్నారు. అనంతరం స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. చల్లావారిపల్లి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ఒక్కసారిగా కుక్కల గుంపు దూరడంతో ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక ఇద్దరూ బోల్తా పడ్డారు. ఈ ఘటనలో రత్నమ్మకు తీవ్రగాయాలు కాగా విశ్వనాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రత్నమ్మను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



అధికారులను నిలదీస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధులు

గంగవరం, జూలై 20: వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది చోటా నాయకుల ప్రోద్భలంతో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేపట్టి అర్హులను అనర్హులుగా చూపించిన వలంటీర్లపై, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు అధికారులను డిమాండ్ చేశారు. శనివారం పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెప్ప ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభంకాగానే పెన్షన్ల పంపిణీ పేరుతో ప్రొటోకాల్‌ను విస్మరించి ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ బ్యానర్లు కట్టి కార్యాలయాలు కనిపించకుండా చేశారని వైసీపీ ప్రజాప్రతినిధులు విమర్శించారు. దీనిపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. గతంలో ఇచ్చిన పెన్షన్లకు అదనంగా ఒకేసారి రూ.7 వేలు ఇవ్వడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం అధికారులు నచ్చజెప్పడంతో ఇరుపార్టీల నాయకులు శాంతించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్‌లు మాట్లాడుతూ మండల కేంద్రంలో నూతనంగా జూనియర్ కళాశాల ప్రారంభించామని కోర్సుల వివరాలపై అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించాలని కోరారు. అనంతరం శాఖలవారీగా సమీక్ష నిర్వహించి అభివృద్ధి వివరాలు, పెన్షన్లు, హౌసింగ్ వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ ఫణికుమార్, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, జూలై20: మండలంలోని బొమ్మయ్యగారి పల్లె పంచాయతీలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పంచామృత అభిషేకం, అర్చనలు, కలశపూజలతో పాటు పూజలు నిర్వహించారు.

జిప్సం వాడకంతో అధిక దిగుబడులు



రొంపిచెర్ల, జూలై20: వేరుశనగపంటకు జిప్సం వాడకంతో అధిక దిగుబడులు, గింజల్లో నూనె శాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం రొంపిచెర్ల రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతు నాగిశెట్టి బాలసుబ్రమణ్యంకు చెందిన వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. జిప్సం వినియోగంపై రైతులకు వివరించారు. విత్తనాలు విత్తే సమయంలో ఎకరాకు 200 కేజీలు, పంట కలుపు తీసే సమయంలో ఎకరాకు 25 నుంచి 35 కేజీల వరకు జిప్సం రెండు పర్యాయాలు వేయాలని సూచించారు. వీఏఏ వెంకట్రమణనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ నివారణకు బీసీజీ వేసుకోవాలి

రొంపిచెర్ల, జూలై20: మండలంలోని 60 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు దినేష్‌కుమార్ నాయక్ ప్రజలను కోరారు. శనివారం రొంపిచెర్లలో పలువురికి వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బులు, క్యాన్సర్, హెచ్ఐవీ బాధితులు, అనారోగ్యంతో ఉన్న వారు వ్యాక్సిన్ వేసుకోరాదని తెలియజేశారు. పొగతాగేవారు, షుగర్, బీపీ ఉన్నవారు వ్యాక్సిన్ వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ రాజేశ్వరి, టీబీ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడికృత్తిక పోస్టర్ల ఆవిష్కరణ



గంగవరం, జూలై 20: పలమనేరు మున్సిపల్ పరిధిలోని టీఎస్ అగ్రహారంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాల పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 28, 29 తేదీలలో ఆడికృత్తిక సందర్భంగా రెండు రోజుల పాటు ఆల యంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు నిర్వాహకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, టీడీపీ నాయకులు గిరి, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నివారణపై ఇంటింటి సర్వే

బైరెడ్డిపల్లె, జూలై 20: మండలంలోని కమ్మనపల్లె, ఎర్రకదిరేపల్లె గ్రామాల్లో జ్వరాల నివారణపై శనివారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేతుల శుభ్రత, పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యాధుల బారినపడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వివరించారు. దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది పుష్పలత, జ్యోత్స్న, పద్మ, విజయమ్మ, అమరమ్మ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నిరుపేదలకు అన్నదానం



గుడిపాల, జూలై 20: స్థానిక అన్న క్యాంటీన్‌లో శనివారం జరిగిన అన్నదానానికి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, టీడీపీ నాయకులు బోడెబ్బ నాయుడు, కేపీ ప్రసాద్, మాజీ ఎంపీపీ నాగరాజ్‌యాదవ్, కిట్టు, మహదేవన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు వీడ్కోలు సత్కారం



గుడిపాల, జూలై 20: తహసీల్దార్ విజయలక్ష్మిని కార్యాలయ సిబ్బంది, అధికారులు శనివారం సత్కరించారు. ఆమె అనంతపురానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆమెకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డీటీ కళ్యాణి, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

బాగోతం బయటపడుతుందనే చెవిరెడ్డి భయం: టీడీపీ

పాలసముద్రం, జూలై 20: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌లపై మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపణలు చేయడం తగదని మండల టీడీపీ నాయకులు అన్నారు. శనివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు మాట్లాడుతూ చెవిరెడ్డి బోగస్ ఓట్లు చేర్పించి టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించడంపై నాని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారన్నారు. విచారణ చేయడంతో బాగోతం బయటపడి జైలుకు వెళ్ళాల్సి వస్తుందనే భయంతోనే పులివర్తి నాని, సీఆర్ రాజన్‌లపై చెవిరెడ్డి ఆరోపణలు చేస్తున్నారని నాయకులు విమర్శించారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు అరుళ్‌నాథన్, సాంబశివన్, రవినాయుడు, జె. విజయ్‌కుమార్, వాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి చర్యలు

గుడిపాల, జూలై 20: రామభద్రాపురం పంచాయతీ భవనం శిథిలావస్థలో ఉన్నందున కొత్తది మంజూరు చేయాలని పంచాయతీ సర్పంచ్ హరిణిహేమాద్రి నాయుడు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ భవన నిర్మాణానికి నిధులు మంజూరుతో పాటు ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

శాకాంబరి అలంకారానికి కూరగాయల వితరణ

ఐరాల(కాణిపాకం), జూలై 20: ఆషాడ పౌర్ణమి పురస్కరించుకుని కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ మణికంఠేశ్వర స్వామి ఆలయంలోని మరగదాంబికకు శాకాంబరి అలంకరణ కోసం శనివారం కొందరు కూరగాయలను వితరణ చేశారు. పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి, మోహన్ రెడ్డి,సత్యనారాయణశెట్టి,బాబురెడ్డి,శ్రీవారి సేవకుల బృందం 15 టన్నుల కూరగాయలను అందించారు. కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణపై అవగాహన

పూతలపట్టు, జూలై 20: మామిడిలో సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన పెంచుకోవాలని హార్టికల్చర్ డీడీ మధుసూధన రెడ్డి కోరారు. తిమ్మిరెడ్డిపల్లి వద్ద శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికాయలు కోసిన వెంటనే కొమ్మలు కత్తిరింపు పనులు చేపట్టాలన్నారు. కొమ్మలు కత్తిరింపులో ఎరువులు ఎలా వేయాలి, ఎలా దున్నాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మండల ఉద్యానశాఖ అధికారి వింధ్యతో పాటు రైతు భరోసా కేంద్రం అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, జూలై 20: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదం చేశారు.

నేడు పుస్తకావిష్కరణ

చిత్తూరు కల్చరల్, జూలై 20: స్థానిక సుందరయ్యవీధి రామలక్ష్మి నర్సింగ్ హోంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి విజయ్‌కుమార్ విరచిత కవితాఝురి, కవితాలాహరిల పుస్తకావిష్కరణల కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు సంస్థ నూతన అధ్యక్షులు గిరిధరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు

భద్రతా నియమావళిపై అవగాహన

పెనుమూరు, జూలై 20: రోడ్డు భద్రతా నియమావళిపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ మణికంఠ సూచించారు. శనివారం ఆయన పెనుమూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. పాత కేసులను, రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సీజ్ చేసిన వాహనాలను త్వరగా క్లియర్ చేయాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ కుళాయప్ప, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పులిగుండు గిరిప్రదక్షిణ

పెనుమూరు, జూలై 20: పౌర్ణమి సందర్భంగా పులిగుండు శివాలయంలో శనివారం వైభవంగా పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కొత్తరోడ్డు, ఠాణా వేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణలో భాగంగా స్వామివారిని ఊరేగించురు. స్వామికి భక్తులు హారతులిచ్చారు. తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి అన్నదానం నిర్వహించారు.

ఎంపీ దగ్గుమళ్లకు సన్మానం



చిత్తూరు సిటీ, జూలై20: ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావును రాధే కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని రాధే కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో ఆయనకు కార్యాలయ సిబ్బంది శాలువ కప్పి సన్మానించారు. గతంలో ఈ సంస్థ చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను సిబ్బంది కొనియాడారు. సంస్థ అధినేత రాధే, సిబ్బంది వికాస్, భాస్కర్ రావు, వినోద్ రెడ్డి, మహమ్మద్ ఇలియాస్ పాల్గొన్నారు.

సీపీఎం, సీఐటీయూ పదవులకు రాజీనామా

చిత్తూరు సిటీ, జూలై 20: సీపీఎం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష పదవులకు రాజీనామా చేస్తున్నట్లు చైతన్య చెప్పారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ జిల్లా స్థాయి అంతర్గత కలహాలవల్ల రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ఒలంపిక్స్‌లో అత్యధిక పతకాలు సాధించాలి

చిత్తూరు రూరల్, జూలై 20: ప్యారిస్ ఒలంపిక్స్‌లో భారత క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించాలని అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ పోతురాజు ఆకాంక్షించారు. శనివారం అపోలో కళాశాలలో విద్యార్థులు ఒలంపిక్ టార్చ్ రిలే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరావు, కబిలన్, అన్నాదొరై, కిరణ్, రాకేష్, దిలీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక ఫోకస్ : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 20: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈవోపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధుల కట్టడిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు. జిల్లాలో అక్కడక్కడ డెంగ్యూ, డైయేరియా, చికెన్ గున్యా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. కలుషిత తాగునీరే ప్రధాన కారణమన్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందుబాటులోని నిధుల నుంచి జీతాలు చెల్లించాలన్నారు. ఈ విషయంలో సర్పంచులు పంచాయతీ సెక్రటరీలను సమన్వయం చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీల మాదిరిగా గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు రోజూ ఉదయం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు నమోదైన వెంటనే గ్రామ మండల స్థాయి వైద్యాధికారులు అప్రమత్తమవ్వాలన్నారు. వాటర్ టెస్టింగ్ నివేదికలు ఎప్పటికప్పుడు పరిశీలించి స్థానిక ఆరోగ్య సిబ్బందితో ఫీవర్ సర్వే వివరాలపై చర్చించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గ్లోరియా, డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, డీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనాల సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 20: సరైన నంబర్‌ప్లేట్, పత్రాలు లేని 110 ద్విచక్ర వాహనాలను శనివారం ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం గాంధీ విగ్రహ కూడలిలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఎస్పీ మణికంఠ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం అందరి బాధ్యత అన్నారు. వాహనానికి సరైన ధ్రువపత్రాలు, నంబర్‌ప్లేట్లను కలిగివుండటం ముఖ్యమన్నారు. నియమాలను పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నంబర్‌ప్లేట్లు లేకుండా నడుపుతున్నారని, ఆ వాహనం దొంగతనానికి గురైన కనిపెట్టడం కష్టమన్నారు. అదే సమయంలో ఆ వాహనాన్ని అసాంఘిక కార్యక్రమాలకు వాడితే యజమాన్ని కేసుల్లో ఇరుక్కుంటాడన్నారు. హెల్మెట్‌ను తప్పకుండా ధరిస్తే ప్రాణనష్టం జరిగే అవకాశం తక్కువన్నారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో పౌర్ణమి గిరి ప్రదక్షణ



చిత్తూరు కల్చరల్, జూలై 20: గిరింపేట చెంగల్‌రాయకొండ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో శనివారం పౌర్ణమి గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ ఈవో సుబ్బారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు పూల సుబ్రమణ్యం, డాక్టర్ ఎస్‌టీ రంగనాథంలు ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం ఆలయ మూల వర్లను ప్రత్యేక రథంపై ఉంచి గిరిప్రదక్షిణ నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని హరోంహర అంటూ స్మరించారు. రామవిలాస సభ కమిటి, ఎస్‌టీఆర్ క్లీనిక్, ప్రభగ్రాండ్ ఇన్ సంస్థల నిర్వాహకులతో పాటు దాతలు అన్నప్రసాదాలు వితరణ చేశారు.

వైద్య సేవలు అందకే శిశువు మృతి: కుటుంబ సభ్యుల ఆరోపణ

వెదురుకుప్పం, జూలై 20: సకాలంలో వైద్యం అందకే తమ బిడ్డ చనిపోయాడని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి కథనం ప్రకారం చెందిన అర్జున్ భార్య గాయత్రిని శుక్రవారం తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రిలో చేర్చారు. నార్మల్ డెలివరీ ద్వారా శిశువుకు జన్మనిస్తోందని తొలుత వైద్యులు తెలిపారు. శనివారం ఉదయం సిజేరియన్ ద్వారా మగ బిడ్డ పుట్టాడు. పసికందును ఐసీయూకు తీసుకెళ్లారు. తర్వాత వచ్చి హార్ట్‌బీట్ లేక చనిపోయాడని చెప్పారు. సకాలంలో సరైన వైద్య సేవలు అంది ఉంటే శిశువు చనిపోయేది కాదని అర్జున్ కుటుంబీకులు ఆరోపించారు.

కార్పొరేట్ సంస్థలకు మోదీ సర్కారు దాసోహం: సీపీఐ

నగరి జూలై20: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం నిధులు తెప్పించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని సీపీఐ నాయకులు కోరారు. స్థాని పార్టీ కార్యాలయంలో శనివారం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక వర్గాన్ని, ప్రతిపక్షాలను అణగదొక్కుతోందన్నారు. నాగరాజు, కోదండయ్య, వేలన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డితో ఎలాంటి సంబంధాలు లేవు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూలై 20: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్‌లకు ఎలాంటి సంబంధం లేదని టీడీపీ నేతలు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాటలు అవాస్తవమన్నారు. పెద్దిరెడ్డి విధానాలు నచ్చక రాజన్ టీడీపీలో చేరారన్నారు.. పెద్దిరెడ్డితో సత్సంబంధాలుంటే పులివర్తి నానిపై దాడి ఎందుకు చేశారని ప్రశ్నించారు. ఓటమిని జీర్ణించుకోలేక టీడీపీ నేతలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు వెంకటేస్ యాదవ్, మోహన్‌రాజ్, జయచంద్ర నాయుడు, బాబు నాయుడు, మోహన్ రెడ్డి, జాఫర్, శంకర్, విజయ్‌కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

చిత్తూరు రూరల్, జూలై 20: మత్తుపదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వినోద్ భట్ విద్యార్థులకు హితవు పలికారు. శనివారం చిత్తూరులోని అపోలో కళాశాల విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శాంహజ్, అశోక్‌రెడ్డి, జాకీర్, జయప్రియ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన ఎంఈఓ

వెదురుకుప్పం, జూలై 20: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో దామోదరం తనిఖీ చేశారు. భోజనం తిని రుచి చూశారు. భోజన పథక నిర్వహణపై ఆరా తీశారు. ఆయన వెంట టీచర్లు పురుషోత్తం, చేతన ఉన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి విశేష పూజలు

వెదురుకుప్పం, జూలై20: చిన్నమరెడ్డికండ్రిగలోనిఇ లక్ష్మీ నరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తులసి దళాలు, సుగంధభరిత పుష్పాలతో ప్రత్యేకంగా స్వామిని అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గిరి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, సుబ్రహ్మణ్యం దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలకవర్గంలో స్థానికులకు అవకాశం కల్పించాలి

తవణంపల్లె, జూలై 20: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయం పాలక మండలిలో స్థానిక బలిజ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని అరగొండలోని బలిజ సామాజిక వర్గానికి చెందిన పలువురు నేతలు ఎమ్మెల్యే మురళీమోహన్‌ను కోరారు. శనివారం వారు వినతిపత్రం ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో రఘు, శ్రీనివాసులు, గురుస్వామి, నారాయణ, పరంధామ, నరసింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి పూజలు



అభిషేకంలో పాల్గొన్న సీకే బాబు దంపతులు

చిత్తూరు కల్చరల్, జూలై20: నగరంలోని కట్టమంచి విశ్వసాయి షిరిడిసాయి బాబా ఆలయంలో శనివారం ఘనంగా గురుపౌర్ణమి పూజలు జరిగాయి ఆలయ ట్రస్టీ, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులు ప్రత్యేక అభిషేకం పూజలు చేశారు. బాబాకు కాకడ్ హారతి, మధ్యాహ్న హారతి, సంధ్యా హారతులు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో న్యూట్రిన్ శివమోహన్‌రెడ్డి, కస్తూరిరంగన్, నారాయణరెడ్డిలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నగరంలోని కుమ్మరవీధిలో సాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెనుమూరు, జూలై 20: స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద శనివారం శంకర్ నేత్రాలయ(చైన్నై) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ చెప్పారు. అందులో 20 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశామన్నారు. వారికి శంకర్ నేత్రాలయ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు.

'శవరాజకీయాలతో నిందలు తగదు'

గుడిపాల: మీ హయంలో రాష్ట్రపతి పరిపాలన గుర్తు కురాలేదా అని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలాజి నాయుడు, అటవీ శాఖ మాజీ డైరెక్టర్ బాలాజి నాయుడులు మాజీ సీఎం జగన్‌ను ప్రశ్నించారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో పేద, ఎస్సీ, ఎస్టీలపై వరుసగా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నా ఏమీ ఎరుగనట్లు వ్యవహరించినప్పుడు రాష్ట్రపతి పరిపాలన గుర్తుకు రాలేదా అన్నారు. శవరాజకీయాలు చేస్తూ టీడీపీ ప్రభుత్వంపై నిందలు మోపడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

చైన్ లాక్కుపోయిన దొంగలు

చిత్తూరు, జూలై 20: సంతపేట ఆశ్రమ వీధికి చెందిన జ్యోతి మెడలోని 32 గ్రాముల బంగారు చైన్‌ను శుక్రవారం దొంగలు లాక్కుని ద్విచక్రవాహనంలో వెళ్లిపోయారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వేలూరు జిల్లా విరింజిపురం పరిసరాల్లో దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

చిత్తూరు, జూలై 20: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ సీఐ ఉలసయ్య కథనం ప్రకారం బాలాజీనగర్‌కాలనీకి చెందిన ఖాదర్(40)కు ఆర్థిక ఇబ్బందులున్నాయి. తరచూ కుటుంబంలో తగాదాలు జరిగేవి. ఈనేపథ్యంలో ఖాదర్ శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని ఫొటో పెట్టాలి : బీజేపీ

చిత్తూరు (సెంట్రల్), జూలై 20: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మోదీ ఫోటోను పెట్టాలని బీజేపీ నాయకులు చిట్టిబాబు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనేక పథకాలను కేంద్రం అమలు చేయడమే కాకుండా ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తోందన్నారు. గతంలో మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ ఫోటోలు పెట్టారన్నారు. ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రధాని ఫోటో ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని కోరారు.

పేద విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



పుస్తకాలు అందిస్తున్న సురేంద్రనాయుడు

విజయపురం, జూలై 20: పన్నూరు ఎస్టీ కాలనీ, ఎల్లసముద్రం ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాలల్లో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య శనివారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. నోటు పుస్తకాలు, క్రయన్స్, పెన్నులు, పెన్సిల్లు తదితర సామగ్రి అందించారు. పేద విద్యార్థులను ఆదుకోవడానికి తన వంతు సాయం అందిస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ యశోద, సభ్యులు పాల్గొన్నారు.

ఐరాల: పొలకల జడ్పీ హైస్కూల్‌లో ఉప సర్పంచ్ బత్తల సురేంద్రనాయుడు యూనిఫాం, పుస్తకాలను విద్యార్థులకు అందించారు. పుస్తకాలను మేదరమిట్ట శంకర్‌నాయుడు,పార్వతమ్మ ట్రస్టు పేరిట వారి కుమారుడు మేదరమిట్ట మోహన్‌నాయుడు సమకూర్చారన్నారు. హెచ్ఎం శాంతకుమారి,జయచంద్రనాయుడు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: చీకురుపల్లి, గుంతూరు, తగ్గువారిపల్లి, సంక్రాంతిపల్లి, బొమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో, వీడీవీకండ్రిగ ఉన్నత పాఠశాల, పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ కళ్యాణ్‌లే ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు ద్వారా విద్యాసా సాహగ్రిని అందజేశారు. టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్,ఎన్పీ జయచంద్ర నాయుడు, ఎన్పీ సురేంద్ర నాయుడు, సర్పంచ్ షీబాస్వామిదాస్ పాల్గొన్నారు.